ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం తథ్యం

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

యాదగిరిగుట్ట, డిసెంబర్ 13 : ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసిస్తే విజయం తథ్యమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. వడ్డె మహాదేవ్ ఫౌండేషన్ చైర్మన్ వడ్డె ఉపేందర్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను మండలంలోని కాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం బండారు దత్తాత్రేయ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువత మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అమ్మాయిలు ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. కాచారం ప్రభుత్వ పాఠశాలకు 20 కంప్యూటర్లు అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం ధర్మారెడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులు, పలువురు నాయకుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వడ్డె ఫౌండేషన్ చైర్మన్ వడ్డె ఉపేందర్, ఉపాధ్యాయులు గవర్నర్ దత్తాత్రేయను సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ సత్యనారాయణ, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి శిరీష

పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జడ్జీలు ఉషశ్రీ, శిరీష

రామన్నపేట, డిసెంబర్ 13 : శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఉషశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన నేషనల్ లోక్ అదాలత్ కో ఆర్డినేషన్ సమావేశంలో వారు మాట్లాడారు. లోక్ అదాలత్‌లో బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, క్రిమినల్, సివిల్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఫ్రీ లిటిగేషన్, వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పెద్ద సంఖ్యలో హాజరై రాజీపడి తమ కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.మల్లయ్య, లీగల్ ఎయిడ్ ప్యానల్ న్యాయవాది మామిడి వెంకట్‌రెడ్డి, కోర్టు సూపరింటెండెంట్‌లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజ్ ఉన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరాకు చర్యలు : డీఎస్ఓ

మోత్కూరు సివిల్ సప్లయ్ గోదాములో బియ్యం పరిశీలిస్తున్న డీఎస్ఓ వనజాత

మోత్కూరు, డిసెంబర్ 13 : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కె.వనజాత అన్నారు. మోత్కూరు, భువనగిరిలోని సివిల్ సప్లయ్ గోదాములను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నేటి నుంచి నూతన డైట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జిల్లాలోని 85 వసతి గృహాలకు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఆయా సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఏసీఎస్ఓ ఎం.రోజారాణి, డీటీసీఎస్ నర్సింగ్ రావు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఉపేంద్ర రవీందర్‌రెడ్డి

విజయ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

రామన్నపేట, డిసెంబర్ 13 : చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సింగిల్‌విండో వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్ర రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన చేనేత కార్మికురాలు దోర్నాల విజయ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. శుక్రవారం ఆమె కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా విజయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కూనూరు ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, నాయకులు అంబటి యాదిరెడ్డి, కూనూరు రమేశ్, మహేశ్ పాల్గొన్నారు..

'కేంద్ర బీమా పథకాలను వినియోగించుకోవాలి'

ఖాతాదారులతో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ ప్రశాంత్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 13 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను బ్యాంకు ఖాతాదారులందరూ వినియోగించుకోవాలని మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. బ్యాంకు ఆవరణలో బీమా పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు చెందుతుండడంతో ఈ నెల 28నుంచి 31వరకు బ్యాంకుకు సంబంధించిన యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ మొదలగు ఖాతాదారుల సేవా కేంద్రాలు నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు తమ లావాదేవీలను ఈ నెల 27లోపు వినియోగించుకోవాలని సూచించారు.

'దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధిద్దాం'

ఆలేరు టౌన్, డిసెంబర్ 13 : దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధిద్దామని కురుమ సంఘం నాయకులు అన్నారు. ఆలేరులోని రహదారి బంగ్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం కోకాపేటలో జరిగే దొడ్డి కొమురయ్య భవన్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. 14న కోకాపేటలో జరిగే కురుమ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కురుమ సంఘం జిల్లా సభ్యులు కాదూరి అచ్చయ్య కురుమ, ఆలేరు, యాదగిరిగుట్ట మండలాధ్యక్షులు బండ పర్వతాలు, కౌడే మహేందర్ కురుమ, నాయకులు ఉప్పలయ్య, వెంకటేశ్, సిద్ధులు, సంపత్ పాల్గొన్నారు.

మెరిట్ ప్రకారం కేర్‌టేకర్ ఉద్యోగం కేటాయించాలి

- బాధిత యువతుల ధర్నా
- అరెస్ట్ చేసిన పోలీసులు

యువతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 13 : మెరిట్ లిస్ట్ ప్రకారం కేర్‌టేకర్ ఉద్యోగం కేటాయించాలని ఉద్యోగార్థులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు మెరిట్ లిస్టులో ఉన్నవారిని కాదని అనర్హులాలికి ఉద్యోగం కేటాయించడాన్ని నిరసిస్తూ బాధిత యువతులు మండల కేంద్రంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కేర్‌టేకర్ ఉద్యోగానికి 1ః3 నిష్పత్తి ప్రకారం మెరిట్ లిస్టులో ఉన్నవారిని ఇంటర్వ్యూకు పిలిచారు. కానీ.. మెరిట్ లిస్టులో లేని అనర్హులాలికి ఉద్యోగం కేటాయించారని మూడ్రోజుల నుంచి ఎంఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఫోన్ చేసినా ఎత్తడం లేదని బాధిత యువతులు పేర్కొన్నారు. మెరిట్ లిస్ట్ ప్రకారం ఉద్యోగం కేటాయించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో ధర్నాకు దిగారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అమ్ముడుపోయి మెరిట్ లిస్ట్‌లో ఉన్న తమకు తీవ్ర అన్యాయం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం పోలీసులు వచ్చి ఆందోళన చేస్తున్న యువతులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికారులంతా కలిసి ఉద్యోగం రాకుండా మోసం చేశారని, న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతారా? అని యువతులు మండిపడ్డారు.

వినూత్న ఆవిష్కరణలు హర్షణీయం : ఎమ్మెల్యే

జిల్లా స్థాయి ప్రథమ బహుమతి పొందిన బీబీనగర్ మండలం గూడూరు జడ్పీ పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 13 : విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని చూసి పరిష్కారం దిశగా ఆలోచించి వినూత్న ఆవిష్కరణలు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాయగిరిలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన ముగింపులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని మున్ముందు మరిన్ని అబ్బురపడే ఆవిష్కరణలు చేసేవిధంగా కృషి చేయాలన్నారు. డీఈఓ కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వినూత్నంగా ఆలోచించే విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సహించాలన్నారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని సూచించారు. రెండు రోజుల ప్రదర్శనలో 118 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు, 215 సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టులు ప్రదర్శించగా.. వాటిలో నుంచి 12 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, విద్యా శాఖ సహాయ సంచాలకులు ప్రశాంత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న వేములకొండ మత్స్య సహకార సంఘం ఎన్నికలు

వలిగొండ, డిసెంబర్ 13 : మండలంలోని వేములకొండ గ్రామ పరిధిలోని ఊర చెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలకు మత్స్యశాఖ అధికారులు శుక్రవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే సభ్యుల నుంచి ఈ నెల 16, 17, 19 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 20న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణ, 26న ఎన్నికలు నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువతి అదృశ్యం

వలిగొండ, డిసెంబర్ 13 : మండలంలోని మొగిలిపాక గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలిపాకకు చెందిన భీమనబోయిన మానస (20) గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఇండ్లల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

సీజ్ చేసిన మట్టిని తరలిస్తే క్రిమినల్ చర్యలు : తాసీల్దార్

వలిగొండ, డిసెంబర్ 13 : మండలంలోని రెడ్లరేపాక గ్రామ పరిధిలో గతంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన సుమారు 800 ట్రక్కుల మట్టిని తరలించేందుకు ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు పెడుతామని తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెడ్లరేపాక గ్రామ పరిధిలో సీజ్ చేసిన మట్టిని గురువారం రాత్రి కొందరు అక్రమార్కులు తరలించే ప్రయత్నం చేస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ సిబ్బందిని హూటాహూటిన అక్కడికి పంపించి కాపలా ఉంచామన్నారు. గతంలో సీజ్ చేసిన మట్టిని మైనింగ్ శాఖ ఏడీ ఆధ్వర్యంలో త్వరలో వేలం వేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలి

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 13 : ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మొబైల్ యాప్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని జలాల్‌పూర్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల వివరాల సేకరణను పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు నమోదు చేసుకునేందుకు సర్వే చేపడుతున్నామన్నారు. సర్వే సజావుగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, సౌజన్య పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని వైష్ణవికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

రాజాపేట, డిసెంబర్ 13 : రాయగిరి విద్యాజ్యోతి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో రాజాపేట మండలం నెమిల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఇందిర పాల వైష్ణవి, దూది వెంకటాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని రేఖ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను డీఈఓ సత్యనారాయణ, ఎంఈఓలు చందా రమేశ్, నాగవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, గైడెన్ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్నకుమారి, భారతి అభినందించారు.

ఉత్తమ రైతు మల్లయ్యకు సన్మానం

ఉత్తమ రైతు మల్లయ్యకు అవార్డు అందజేసి సన్మానిస్తున్న రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 13 : ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎంపికైన మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కంచి మల్లయ్యను రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి శుక్రవారం సన్మానించి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. కర్నూల్ జిల్లాలోని పాలెం వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రొఫెసర్ జయంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విశ్వవిద్యాలయ వజ్రోత్సవం మల్లయ్యకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను అనుసరిస్తూ ఉత్తమ సాగు పద్ధతులను అవలంబిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలువడం గొప్ప విషయమన్నారు. ఉత్తమ అవార్డు గ్రహీత మల్లయ్య మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక వ్యవసాయంలో అను నిత్యం తన వెన్నంటే ఉంటూ సాగు పద్ధతుల్లో మెళకువలు తెలియజేస్తూ అధిక దిగుబడులు సాధించేలా కృషి చేసిన జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి ఉమ్మడి జిల్లా పేరును ముందుకు తీసుకుపోతానన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కంచి లలిత, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

పోచంపల్లి అభివృద్ధికి అందరూ సహకరించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 13 : పట్టణాభివృద్ధికి రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. నీటి సరఫరా నిర్వహణకు రూ.19లక్షలు, పారిశుధ్య నిర్వహణకు రూ.9లక్షలు, కార్యాలయ సాధారణ ఖర్చులకు రూ.3.50 లక్షల మంజూరుకు కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణకు తరలి రావాలి

వలిగొండ : తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

వలిగొండ, డిసెంబర్ 13 : తెలంగాణ మలి దశ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా బీబీనగర్‌లో శనివారం చేపట్టనున్న విగ్రహావిష్కరణకు తెలంగాణ ఉద్యమకారులు, జిట్టా అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని తెలంగాణ ఉద్యమ నాయకుడు కళ్లెం లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు చిలుగూరి సత్తిరెడ్డి, శీలం స్వామి, బత్తిని రవీందర్, బొల్లు శ్రీనివాస్, నానచర్ల రమేశ్, కొండూరి సత్తయ్య, మస్కు నరసింహ, అంబటి మోహన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీబీనగర్ : మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిట్టా అభిమానులు మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణకు జిట్టా అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మలి దశ ఉద్యమ నాయకులు సోమారం శంకర్, చింతల లక్ష్మీనారాయణ, పాశం శంకర్‌రెడ్డి, కడెం సాయిలు, గాండ్ల రవి, మద్దూరి జంగయ్య, సందీప్ పాల్గొన్నారు.

ఊర చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

గోదావరి జలాలతో చెరువులు నింపుతాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మోటకొండూర్, డిసెంబర్ 13 : మోటకొండూర్ మండలాభివృద్ధికి కృషి చేస్తానని, గోదావరి జలాలతో నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నింపుతామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఊరచెరువు అలుగు వద్ద శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో మార్కెట్ యార్డు, పీఏసీఎస్ ప్రధాన సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. మండల కేంద్రానికి అన్ని గ్రామాల నుంచి లింక్ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య, వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ పాండురంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

ఆలేరు టౌన్ : పట్టణంలోని శివాలయం వీధి, కాటమయ్య నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆర్డీఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ లక్ష్మి, మేనేజర్ శారద, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ

యాదగిరిగుట్ట : పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, విద్యార్థులు నిద్రించే గది, బాత్‌రూములను పరిశీలించారు. అనంతరం హాస్టల్‌లో సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, సీఐ రమేశ్ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే కుంభం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఇందిరమ్మ ఇండ్ల సర్వే మొబైల్ యాప్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 13 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే మొబైల్ యాప్‌ను కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల్లో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. నేడు అన్ని సంక్షేమ వసతి గృహాల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహిస్తూ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డిప్యూటీ ఈఈ నాగేశ్వర్‌రావు, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీరాములు, తాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని రెండో వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామానుజులరెడ్డి ఉన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిస్తీ ప్రమాణం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆవేజ్ చిస్తీ, పక్కన ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 13 : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా భువనగిరి పట్టణానికి చెందిన ఎండీ ఆవేజ్ చిస్తీ నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయంలో చిస్తీ బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ కె.గంగాధర్, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్, భువనగిరి ఏఏంసీ చైర్‌పర్సన్ రేఖ, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఎ.సంజీవరెడ్డి, నాయకులు ప్రమోద్ కుమార్, వెంకటేశ్, జహంగీర్ పాల్గొన్నారు.

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి : డీఏఓ

కోటమర్తిలో పం